ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 02.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్‌హౌస్ సమీపంలోని బాపూఘాట్ వద్ద గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాత్ముడికి అంజలి ఘటించారు.

2. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల కరువు భత్యం డీఏ/డీఆర్ మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

3. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద ఎన్నికల హామీల మేరకు లక్ష రూపాయల నగదు, తులం బంగారాన్ని లబ్దిదారులకు ప్రభుత్వం ఇవ్వాలని బీఆర్ ఎస్ నేత హరీష్ రావు డిమాండ్ చేశారు.

4. రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-----------------------------

**గాంధీ బాబూఘాట్**

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్‌హౌస్ సమీపంలోని బాపూఘాట్ వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బాపూఘాట్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడ ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను

తిలకించడంతో పాటు, బాపూఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్, ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొని బాపూజీ సేవలను స్మరించుకున్నారు.

**పీటీసీ, హైదరాబాద్**

--------------------------

క్యాబినెట్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల కరువు భత్యం డీఏ/డీఆర్ మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, బకాయిలను విడతల వారీగా చెల్లించాలని నిర్ణయించింది. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా 2 వేల 500 కోట్ల అదనపు భారం పడనుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తిన వర్షాభావ పరిస్థితులు, 235 మండలాల్లోని కరువుపై సుదీర్ఘంగా చర్చించి, త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర సాయం కోసం ఢిల్లీకి మంత్రుల బృందాన్ని పంపాలని తీర్మానించారు.

**(డెస్క్)**

------------------------------

గాంధీ-బండి సంజయ్

అహింసను ఆయుధంగా...సత్యమే మార్గంగా కోట్లాదిమంది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన మహనీయులు మహాత్మాగాంధీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి

సంజయ్ కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ వద్ద మహాత్ముడి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ గాంధీ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం లాంటి ఎన్నో పోరాటాలు దేశానికి ఆదర్శం అని బండి సంజయ్ అన్నారు.

**(పిటిసి, కరీంనగర్ )**

----------------------------

రాంచందర్ రావు-స్వచ్ఛ భారత్

మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని విజయవంతంగా నడుపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు  కొనియాడారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్క పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి  లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆ మహనీయులకు నివాళులర్పించారు. సికింద్రాబాద్ చిలకలగూడలో జరిగిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో పాల్గొని చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అందరి కృషిలోనే ఆరోగ్యకరమైన భారత దేశం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

**(HYD –PTC)**

--------------------------------

గాంధీ-సిరిసిల్ల

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు  రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా  ఘనంగా నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, పలు గ్రామాల్లో  మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. వేములవాడ లో జరిగిన కార్యక్రమంలో  ప్రభుత్వవిప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొని మహాత్మ

గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..

**(సౌండ్ బైట్ ఆది శ్రీనివాస్)**

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

--------------------------------

**గాంధీ-జిల్లాలు**

గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, హన్మకొండ, జనగామ, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాసంఘాలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గంలో పయనించడమే గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి అని వక్తలు కొనియాడారు.

(పీటీసీ కరీంనగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, హన్మకొండ, జనగామ, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నిర్మల్)

-----------------------

కళ్యాణలక్ష్మి-హరీశ్ రావు

బీఆర్ఎస్ హయాంలో లక్షలాది మంది పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచి, బాల్యవివాహాలను అడ్డుకున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ పథకాలు ప్రారంభించి నేటితో 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆడబిడ్డలను మోసం చేసిందని ఆరోపించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు

రెండు లక్షల దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి, హామీ ఇచ్చిన విధంగా తులం బంగారాన్ని వెంటనే అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**(పీటీసీ, హైదరాబాద్)**

-------------------------

స్వచ్ఛతా హీ సేవా-వనపర్తి కలెక్టర్

ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ,మండల,జిల్లా స్థాయి కార్యాలయాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కార్యక్రమాలు కార్యక్రమాలు నిర్వహించామని ఆకాశవాణితో తెలిపారు.

**( బైట్ - వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి)**

**(పీటిసి వనపర్తి జిల్లా )**

--------------------------

ఆసిఫాబాద్ -స్వచ్ఛతా హీ సేవా

ఆసిఫాబాద్ జిల్లావాంకిడి మండల సరిహద్దులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, ఏఎంవిఐ మోహన్ బాబు తదితరులు హాజరై మొక్కలు నాటి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

------------------------------

మంచిర్యాల-వణ్యప్రాణి వారోత్సవాలు

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల తాళ్లపేట రేంజ్ అటవీ శాఖ అధికారి వికాస్ అన్నారు.

**(బైట్... తాళ్ళపేట రేంజ్ ఫారెస్ట్ అధికారి వికాస్)**

**(పీటీసీ మంచిర్యాల జిల్లా)**

-----------------------------

ఖమ్మం- స్వచ్ఛతా-హీ-సేవా

స్వచ్ఛతా-హీ-సేవా మాసోత్సవాల్లో భాగంగా ఈ రోజు ఖమ్మం రైల్వే స్టేషన్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ ఎం. రాజేంద్ర ఆధ్వర్యంలో రైల్వే అధికారులు, ఉద్యోగులు ప్రదర్శన చేపట్టారు. ప్రాంగణంలో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఖమ్మం జిల్లా మధిరలో బీజేపీ పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్ ఆధ్వర్యంలో శివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

**(PTC, khammam)**

----------------------------

సిరిసిల్ల-సేవా సంకల్ప్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ పూర్తి చేసుకున్న సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా  బిజెపి పార్టీ ఆధ్వర్యంలో  సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా  బిజెపి శ్రేణులు శ్రమదానం తో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాయి.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

--------------------------

ఆసిఫాబాద్ వన్యప్రాణి వారోత్సవాలు

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణి, అటవీ డివిజన్ అధికారి అప్పయ్య, అటవీ క్షేత్రాధికారి గోవింద్ చంద్ర తో కలిసి జండా ఊపి ప్రారంభించారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

---------------------------

ఆసిఫాబాద్-సైబర్ నేరాలు

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిన్న రాత్రి ఫాస్ట్ మార్చ్ నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ నీతిక పంత్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

---------------------------

వాతావరణం

రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వర్ష సూచన లేదని పేర్కొంది. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

**(డెస్క్)**

------------------------------